క్లుప్తంగా

బొమ్మగాని ధర్మ భిక్షంకు ఘన నివాళి



తిరుమలగిరిలో ధర్మ భిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : సీపీఐ ఆధ్వర్యంలో బొమ్మగాని ధర్మ భిక్షం వర్ధంతి సభను మంగళవారం మున్సిపల్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లంల యాదగిరి, మండల కార్యదర్శి శ్రీకాంత్, కె.మల్లయ్య, రాంప్రభు, ఫయాజ్, పత్తెపురం యాదగిరి, రాము గౌడ్, అశోక్, వెంకటస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం



కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామ ఎస్సీకాలనీలో వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు ముత్యాలమ్మ దేవత ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలకు ఆహ్వానపత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పేరెల్లి ఉపేందర్, శతకోటి వెంకన్న, పేరెల్లి లింగయ్య, పిట్టల సైదులు, వేర్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తీగుల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫీజులను ఒక్కొక్క పేపర్‌కు రూ.200ల నుంచి రూ.1000కు పెంచడం, డీఎస్సీ దరఖాస్తు రుసుము పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం టెట్, డీఎస్సీ పరీక్షల ఫీజును తగ్గించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనకి బహిరంగ లేఖను రాసినట్లు తెలిపారు. టెట్ ఫీజు పెంచడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ అభ్యర్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఆయనతో పాటు మోడెపు సురేందర్, సంగేపాక ప్రభాకర్, గండమల్ల వెంకన్న, కుంభం మురళి, నెల్లుట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.50,116 విరాళం



విరాళం అందజేస్తున్న దాత చలేంద్రచారి

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని కుక్కడంలో బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవానికి గ్రామానికి చెందిన హసానబాద చలేంద్రచారి అతడి కుమారులు సురేష్, నరేష్‌లు మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.50,116లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముక్కాల అవిలమల్లు యాదవ్, మద్దెల భిక్షపతి గౌడ్, మద్దెల యాకయ్యగౌడ్, బింగి భిక్షపతిగౌడ్, బీసు రవి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

మోతె : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నర్సింహాపురం, హుస్సేనాబాద్, మామిళ్లగూడెం, ఉర్లుగొండ, విభళాపురం గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. కవాతులో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, స్థానిక ఎస్‌ఐ యాదవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అనంతగిరి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రంగయ్యగూడెంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యాధికారి హరినాథ్, వైద్యసిబ్బంది సురేందర్, విజయ్‌కుమార్, శ్రీదేవి, కృష్ణమూర్తి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మోతె : మండలంలోని నర్సింహాపురం శివారులో గల పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ యాదవేంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. రాయికుంట తండాలో సారాయి తయారు చేసి విక్రయిస్తున్న అంగోతు నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భవన నిర్మాణానికి నిధులు

- అర్వపల్లి పశువైద్యశాల భవనానికి ఎట్టకేలకు మోక్షం
- డీఎంఎఫ్ నుంచి రూ.20 లక్షలు మంజూరు
- కొనసాగుతున్న టెండర్ ప్రక్రియ
- పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కాగానే పనులు



శిథిలమైన అర్వపల్లిలోని పశువైద్య కేంద్ర భవనం



పెచ్చులూడుతున్న భవనం స్లాబ్

అర్వపల్లి : రెండు జాతీయ రహదారులపై ఉన్న అర్వపల్లిలోని మండల పశువైద్యశాల భవనం కాలం తీరిపోయి పూర్తిగా శిథిలమై ఏ క్షణమైనా కూలేదశకు చేరింది. అయినా తప్పని పరిస్థితుల్లో వైద్య సిబ్బంది ఈ ఆస్పత్రి భవనంలోనే మూగ జీవాలకు వైద్య సేవలందిస్తున్నారు. అయితే ఎట్టకేలకు ఈ ఆస్పత్రికి మహర్దశ వచ్చింది. డీఎంఎఫ్ నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పక్కా భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు. భవన నిర్మాణం జరిగితే రైతులు, డాక్టర్, పశువైద్య సిబ్బంది కష్టాలు తీరనున్నాయి.

కొన్నేళ్లుగా ఇబ్బందులు..

అర్వపల్లిలోని మండల పశువైద్యశాల 50 ఏళ్ల కిందట నిర్మించినది కావడంతో పూర్తిగా శిథిలమై కాలం తీరిపోయింది. భవనంలో కరెంట్ సదుపాయం కూడా లేదు. ఆస్పత్రి ఆవరణలోని చేతిపంపు పనిచేయడంలేదు. పశువులకు వైద్యం అందించే పశువుల బోను విరిగిపోయింది. ముఖ్యంగా ఆస్పత్రిలోకి వెళ్లడానికి సరైన దారిలేదు. భవనం వర్షాలకు కురుస్తుండడంతో ప్రతి మూడు నెలలకోసారి మందుల స్టాకు ఎక్కడ పెట్టాలో తెలియక డాక్టర్, సిబ్బంది ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికైనా పశువైద్యశాలకు వెంటనే నూతన భవన నిర్మాణ పనులు చేపట్టాలని, మౌలిక వసతులు సమకూర్చాలని ఆయా గ్రామాల రైతులు, వైద్యసిబ్బంది ఉన్నతాధికారులను కోరుతున్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం



ఇక్కడి ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలం కావడంతో కొత్త భవనం నిర్మించుటకు నిధులు మంజూరైనట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న భవనం పూర్తిగా శిథిలమైంది. వెంటనే భవనం నిర్మిస్తే రైతులకు పూర్తి స్థాయిలో పశువైద్య సేవలు అందిస్తాం.

- డాక్టర్ అర్జున్, మండల పశువైద్యాధికారి

టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది



అర్వపల్లి పశువైద్యశాలకు సొంతభవన నిర్మాణానికి డీఎంఎఫ్ ద్వారా రూ.20 లక్షలు మంజూరయ్యాయి. పనుల ప్రారంభం కోసం టెండర్ ప్రక్రియ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం.

- అశోక్, పీఆర్ ఏఈ

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

ఆత్మకూర్(ఎస్) : మండల రెవెన్యూ కార్యాలయాన్ని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలకు ఆర్డీఓ ఎమ్మార్వో కార్యాలయానికి రాగా ఉదయం 10.30 గంటలకు కూడా ఎమ్మార్వో, సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్ రాకపోవడంతో వారికి అటెండెన్స్ రిజిస్టర్లలో అబ్సెంట్ వేశారు. అనంతరం ఎమ్మార్వోకు ఫోన్ చేయగా ఉదయం 11:15 నిమిషాలకు కార్యాలయానికి రావడంతో ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ సిబ్బందిని ఒకరిని తర్వాత ఒకరిని ఆలస్యానికి కారణం ఏమిటి అంటూ ఆరా తీశారు. ఇకనుంచి పది గంటల 30 నిమిషాల తర్వాత కార్యాలయానికి వచ్చినట్లయితే వారిపై తగిన చర్యలు ఉంటాయని సిబ్బంది ద్వారా లిఖితపూర్వకంగా పత్రం రాయించి తీసుకున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సముచిత న్యాయం

దురాజ్‌పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండగడుపుల సూరయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెహ్రూ, ఇందిరాగాంధీలు వాళ్ల కుటుంబాన్ని దేశ సేవ కోసం అంకితం చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం సేవ చేసిన వ్యక్తులను ఏమి చేయలేదనడం మందకృష్ణ మాదిగకు సముచితం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌కు న్యాయశాఖ మంత్రి పదవి ఇచ్చి గౌరవించిందని గుర్తుచేశారు. మందకృష్ణ మాదిగ బీజేపీకి అమ్ముడుపోయాడని ఎద్దేవా చేశారు. నరేంద్ర మోదీ గత పది సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మాదిగలకు ఒక్క పదవి కూడా ఇవ్వలేదని తెలిపారు.

ప్రత్యేక అధికారుల తనిఖీ

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్, కేజీ బీవీలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ప్రత్యేక అధికారులు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ సందీప్‌కుమార్‌లు మంగళవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌లు, డీఓలు భాస్కర్, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకన్న, సిబ్బంది యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులు, రాచకొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాల పంపిణీ పరిశీలన



కోదూరులో పశువులకు టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న కుమారస్వామి

అర్వపల్లి : గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎ. కుమారస్వామి కోరారు. మండల పరిధిలోని కోదూరు గ్రామంలో గాలికుంటువ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 15 నుంచి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు. వచ్చే నెల 13 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీలు రవిప్రసాద్, వెంకన్న, మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, వీఎల్‌ఓ కేఎస్ఎస్.పద్మ, యాకయ్య, గోపాలమిత్రలు కుంభం సురేందర్, ఆల్దాస్ లింగయ్య, సూరారపు అర్జున్, రైతులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. గర్భం దాల్చిన పశువులకు గాలికుంటు వ్యాధి వస్తే కడుపులోనే దూడెలు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. పాలిచ్చే పశువులకు ఈ వ్యాధి సోకినట్లయితే పాలు తగ్గుతాయని అన్నారు. నాలుగు సంవత్సరాలు నిండిన ప్రతి పశువుకు టీకాను తప్పకుండా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవిప్రసాద్, పశువైద్యాధికారులు వెంకన్న, నవీన్, మమత, సిబ్బంది సుష్మ, మహేష్, బుచ్చిబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు ముందు జాగ్రత్తగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. అలాగే వర్ధమానుకోటలోని పశువైద్యశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ వెంకన్న, తుంగతుర్తి సహాయ సంచాలకులు డాక్టర్ రవిప్రసాద్, మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి, ఎల్ఎస్‌ఏ టి.మురళి, మధుసూదన్, లింగమల్లు, రైతులు రెడ్డిమల్ల నర్సయ్య, నజీర్, చంద్రయ్య, సుల్తాన, నర్సయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ స్వామి క్షేత్రం సందర్శన



సూర్యక్షేత్రంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంను మంగళవారం కోదాడకు చెందిన స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ సంస్థ సభ్యులు 45 మంది సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర విశిష్టతను తెలుసుకొని ఈ క్షేత్రాన్ని సందర్శించడానికి వచ్చినట్లు తెలిపారు. సూర్యక్షేత్రంతోపాటు క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయాన్ని కూడా సందర్శించారు. క్షేత్రంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి సీహెచ్. రాజశేఖర్, కోశాధికారి ఇ. చెన్నకేశవరావు, క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, సృజన, సుధాప్రవీణ, రూపవతి, సభ్యులు, క్షేత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన చెట్ల తీగలు



అర్వపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో విద్యుత్ లైన్ స్తంభాలకు అల్లుకుపోయిన తీగలు



అర్వపల్లి - రామన్నగూడెం మధ్య విద్యుత్ స్తంభం సపోర్టు వైరుకు అల్లుకుపోయిన తీగ

అర్వపల్లి : విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుంటున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. సూర్యాపేట–జనగామ 365 బీ హైవేపై అర్వపల్లి పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి రామన్నగూడెం వెళ్లే దారి వెంట పలుచోట్ల విద్యుత్ లైన్ల స్తంభాలు, తీగలకు చెట్ల తీగలు అల్లుకుపోయాయి. స్తంభాల చుట్టూ ముళ్ల పొదలు పెరిగాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది. అంతేకాకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను, తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న అర్చకులు

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 20 న ప్రారంభమైన అధ్యాయన బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి నిర్వహించిన వేడుకలతో ముగిశాయి. ఈ సందర్భంగా చైర్మన్ రాజబాబు ఎరెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త ఉమ్మెంతల ఆహ్లాదరావు, ఉమ్మెంతల హరిప్రసాదరావు, ఆలయ అర్చకులు మరింగంటి వరదాచార్యులు, ముడుంబై రఘువరన్ ఆచార్యులు, దరూరి రాఘవాచార్యులు, గోమఠం రాఘవాచార్యులు, డైరెక్టర్లు చెరుకుపల్లి కృష్ణయ్య, మంగపండ్ల మల్లికార్జున్, కుమ్మరికుంట్ల జానయ్య, చెరుకుపల్లి సైదమ్మ, గంపల శంకర్, ఆయా గ్రామాల భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంట పొలాల పరిశీలన



వెలుగుపల్లిలో ఎండిన పంటచేలను పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : ఎండిన వరి పంటలకు నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెలుగుపల్లి శివారులో ఎండిన పంట పొలాలను నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 ఏళ్ల కాలంలో ఏనాడు కూడా పంటలు ఎండిపోలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేసిందన్నారు. రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం సరికాదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25,000ల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, గోపగాని రమేష్, తడకమళ్ల రవి, మల్లెపాక రాములు, మల్లేష్, వెంకన్న, రాములు, శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కరించాలి



మద్దిరాల : మాట్లాడుతున్న పేర్ల నాగయ్య

మద్దిరాల : గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య డిమాండ్ చేశారు. మండలంలో ఎండిపోయిన పంట పొలాలను మంగళవారం అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల నేడు రైతులు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే ఎకరానికి రూ.50,000 పరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ నర్సయ్య, ఎడ్ల వెంకన్న, పెరుమాళ్ల భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలి

తుంగతుర్తి : సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ కాలువల పరిధిలోని వరిపొలాలు చేతికందే దశలో ఎండిపోతున్నాయని అన్నారు. రైతులు వేలాది రూపాయలను పెట్టుబడి పెట్టి నష్టపోతున్నారని తెలిపారు. చివరదశలో అయినా పంట పొలాలకు సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు గాజుల మహేందర్, లింగయ్య, నరేష్, నాగరాజు, సుధాకర్, లక్ష్మణ్, సాయికృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అటకెక్కిన ఆట సామగ్రి

- పర్యవేక్షణ లేక మూలనపడిన వైనం
- లక్ష్యానికి దూరంగా క్రీడా ప్రాంగణాలు



దూపహాడ్‌లోని క్రీడా ప్రాంగణం

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో క్రీడలపై మక్కువ పెంచేందుకు, ఆసక్తి గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం 2022లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉద్దేశం మంచిదే అయినా కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రాధాన్యతను విస్మరించడంతో లక్ష్యానికి ఆ వేదికలు దూరంగా ఉన్నాయి. మరోవైపు ఆటల కోసం రూ. లక్షలు వెచ్చించి తెచ్చిన కిట్లు పంచాయతీ కార్యాలయాల్లోనే మూలనపడ్డాయి. కొన్నిచోట్ల అవి పక్కదారి పట్టాయి. లక్ష్యాన్ని పూర్తి చేయాలనే ఉద్దేశంతో మండలంలో చాలా వరకు క్రీడలకు అనువుగాని చోట అంటే పాఠశాలలు, వైకుంఠధామాలు, చెరువులు, పంట పొలాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. సింగిల్, డబుల్ బార్లు వేసి క్రీడా ప్రాంగణం బోర్డు ఉంచి చేతులు దులుపుకున్నారు. మండలంలో 46 క్రీడా ప్రాంగణాలకు గాను 30 క్రీడా ప్రాంగణాలను మాత్రమే పూర్తి చేశారు.

కొరవడిన సమాచారం..

తెలంగాణ క్రీడ సంస్థ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం అన్ని రకాల స్పోర్ట్స్ కిట్లను అందజేసింది. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో క్రీడా పరికరాలను ఉంచారు. క్రీడ ప్రాంగణం పరిధిలోని యువకులు.. కార్యదర్శిని సంప్రదించి వాటిని తీసుకోవాలి. ఆడుకున్న తర్వాత మళ్లీ అప్పగించాలి. అయితే క్రీడా పరికరాలు వచ్చాయనే విషయం చాలా చోట్ల స్థానికులకు తెలియదు. చాలా మంది పంచాయతీ కార్యదర్శులు సైతం గ్రామాల్లో ఈ విషయమై సమాచారం ఇవ్వలేదు. దీంతో కార్యాలయాల్లోనే సామగ్రి మూలనపడి ఉంది. కొన్నిచోట్ల గత పాలకులు తమకు అనుకూలంగా ఉన్న వారికి వీటిని కట్టబెట్టినట్లు విమర్శలున్నాయి.

కిట్‌లోని సామగ్రి..

ఒక్కో కిట్ విలువ రూ. 15వేలు. వీటిలో రెండు క్రికెట్ బ్యాట్లు, రెండు బ్యాటింగ్ గ్లౌజ్‌లు, ఒక వికెట్ కీపింగ్ గ్లౌజ్, ఆరు క్రికెట్ బాల్స్, నాలుగు సింథటిక్ వాలీబాల్స్, రెండు వాలీబాల్ నెట్లు, ఒక సైకిల్ పంప్, మూడు డంబెల్స్, రెండు డిస్కస్ త్రోలు, 6 టెన్నికాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ రోప్స్, ఒక స్టాప్ వాచ్, మూడు ప్లాస్టిక్ విజిల్స్ ఉన్నాయి.

పంచాయతీ పర్యవేక్షణలోనే..



పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలోనే క్రీడా పరికరాలు ఉన్నాయి. క్రీడా సామగ్రి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం.

- వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

కోర్టులో ఫైళ్లు దగ్ధం

కోదాడరూరల్ : పట్టణంలోని కోర్టులో షార్ట్‌సర్క్యూట్‌తో పలు ఫైళ్లు దగ్ధమయ్యాయి. సోమవారం రాత్రి కోర్టులోని రికార్డులు భద్రపరిచే గదిలో బీరువా వెనుక గల విద్యుత్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. ప్రమాదంలో బీరువాతో పాటు ఆ గదిలో గల పలు రికార్డులు, ఫైళ్లు దగ్ధమైనట్లు గుర్తించారు. ప్రమాద స్థలాన్ని జడ్జి శ్యాంసుందర్, సీఐ రాముతో పాటు విద్యుత్ ఏఈ మల్లెల శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సంఘటనపై కోర్టు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

బెల్ట్ షాపులపై దాడి

మద్దిరాల : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. కుక్కడం గ్రామంలోని ఓ వ్యక్తి ఇంట్లో ఉన్న 7లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

చిలుకూరు : సీతారాంపురం కోవనెంట్ చర్చిలో మంగళవారం ఇండియన్ క్రిస్టియన్ మినిస్టిస్ సహకారంతో దివ్యాంగులకు వీల్‌చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. దివ్యాంగులకు చేయూత నివ్వాలన్నారు. ఐసీఎం ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జెషిపాల్, సంస్థ రాష్ట్ర డైరెక్టర్ సాల్‌మెన్, వీల్‌చైర్ కోఆర్డినేటర్ మోహన్‌కృష్ణ, చర్చి ఫాదర్ అల్లూరి అబ్రహం, ముప్పరాజు గాంధీ, చందా వెంకటేశ్వరరావు, ఫాదర్స్ రమేష్, శ్రీనివాస్ చారి, లక్ష్మీనారాయణ, శ్రీను, సామేల్ పాల్గొన్నారు.

సాంబశివుడికి ఘన నివాళి



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : సాంబశివుడి 13వ వర్ధంతిని తిరుమలగిరిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, రాంప్రభు, హన్మంతు యాదవ్, సుంకరి జనార్దన్, ఎల్లపు యాదగిరి, కడెం మల్లయ్య, స్వామి, రాము గౌడ్, వెంకన్న, కిరణ్, బత్తుల శ్రీను నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్డీఆర్ పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఆర్

చివ్వెంల : మండల పరిధిలోని గాయంవారిగూడెం ఆవాసం బంగారు తండాకు చెందిన ధరావతు బిచ్చు నాయక్ గత కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. ఈ సందర్భంగా అతడి మృతదేహాన్ని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపు బాగు చేయించరూ..

అర్వపల్లి : మండల కేంద్రంలోని కేశవాపురం కట్ట మీద ఎల్లమ్మ గుడివద్ద చేతిపంపు తుప్పుపట్టి చెడిపోయింది. గతంలో ఈ చేతి పంపు ప్రజలకు మంచినీటిని అందిస్తూ దాహార్తిని తీర్చింది. పశువులకు కూడా నీటి సమస్య తీర్చింది. ప్రస్తుతం ఎండలతో ఈ దారిలో వెళ్లే ప్రజలు దాహార్తికి ఇబ్బంది పడుతున్నారు. చేతిపంపును మరమ్మతు చేయించి నీటి సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.



పనిచేయని చేతిపంపు